మెయిన్

# టీ-మీడియా


సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 201
పేజీలు : 3

గురువారం 19.02.2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ




## ప్రాణాంతకంగా...

# రక్తహీనత





- చిన్నారుల్లో 67%, మహిళల్లో 57 % ఎనీమియా
- ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5 తాజా డేటాలో వెల్లడి

**టి మీడియా, ఫిబ్రవరి 18 ,న్యూఢిల్లీ :** మనదేశంలో ఐదేళ్లలోపు చిన్నారులు, మహిళల్లో రక్తహీనత ప్రాణాంతకంగా మారుతోంది. పిల్లలు, మహిళల్లో పోషకాహార లోపం వల్లే రక్తహీనత ఏర్పడుతోందని, ఈ సవాలును తక్షణమే పరిష్కరించాలని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) తాజా డేటా చెబుతోంది. ఐదు సంవత్సరాల వయసు కలిగిన ప్రతి ముగ్గురు చిన్నారుల్లో ఇద్దరు... అంటే 67.1 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారని ఆ డేటా తెలిపింది. శిశువులకు జన్మనిచ్చే వయసున్న (15-49 సంవత్సరాలు) మహిళల్లో 57 శాతం మందిని కూడా ఇదే సమస్య వేధిస్తోంది. గర్భిణుల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. వారిలో సగానికి పైగా మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. దీనివల్ల తల్లులకే కాదు... పుట్టబోయే బిడ్డలకు కూడా ప్రమాదమే.

### గర్భిణుల్లో ఇన్ఫెక్షన్లు, అలసట

రక్తహీనత (అనేమియా) సమస్య ఉన్న గర్భిణులు తరచూ ఇన్ఫెక్షన్లు, అలసటకు గురవుతున్నారు. అనేక ప్రమాదకరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. చిన్నారుల శరీరం వేగంగా, మెదడు చురుకుగా అభివృద్ధి చెందాల్సిన తరుణంలో రక్తహీనత కలిగితే వారు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు అధికమవుతాయి. వారిలో వృద్ధి కుంటుపడుతుంది. చదువు కూడా నెమ్మదిస్తుంది. తల్లుల విషయానికి వస్తే కనిపించని ఆకలి సమస్య వారి శక్తిని నిర్వీర్యం చేస్తుంది. వారిలో ఉత్పాదక సామర్థ్యం తగ్గిపోతుంది. కుటుంబాల బాగోగులను సరిగా చూసుకోలేరు. సమస్యను సకాలంలో పరిష్కరించలేకపోతే అది తరతరాలుగా వెంటాడుతూనే ఉంటుంది. రక్తహీనతకు కారణం శరీరంలో ఇనుము (ఐరన్) లోపించడమే. ఇది కేవలం ఆహార సమస్య మాత్రమే కాదు. పేదరికం, ఆహార అభద్రత, తరచుగా ఇన్ఫెక్షన్లకు గురి కావడం, పరాన్నజీవుల దాడి, మాతా శిశు ఆరోగ్య సేవలు సరిగా అందుబాటులో లేకపోవడం వంటివి ప్రధాన కారణంగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలు, పేదలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో ఐరన్ లోపంపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. సమస్యను గుర్తించిన తర్వాత, అది ప్రమాదకరంగా పరిణమించిన తర్వాత, శాశ్వత ప్రభావాన్ని చూపిన తర్వాత చికిత్స కోసం పరుగులు పెడుతున్న పరిస్థితి ఉంది.

### గత పదేళ్లలో మహిళల్లో రక్తహీనత 4 శాతం పెరుగుదల

ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5 డేటా ప్రకారం పిల్లల్ని కనే వయసున్న మహిళల్లో రక్తహీనత సమస్య గత పదేళ్లలో నాలుగు శాతం పెరిగింది. సమస్య పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం 2019లో ఎనీమియా ముక్త్ భారత్ (ఎఎంబి) పేరిట ఓ కార్యక్రమాన్ని చేపట్టినా... ఈ సమస్య తగ్గకపోగా, పెరగడం గమనార్హం.



మాతా శిశువులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించడం ద్వారా సమస్యను చాలావరకు పరిష్కరించవచ్చు. బియ్యం, గోధుమ పిండి, వంట నూనె, పాలు, ఉప్పు వంటి పదార్థాలకు అత్యవసర విటమిన్లు, ఖనిజాలు కలిపితే అదే బలవర్ధకమైన ఆహారం అవుతుంది. ఐరన్, బలవర్ధక ఆహారం శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచుతాయి. రోగ నిరోధక శక్తిని ఇనుమడింపజేస్తాయి. గర్భిణుల్లో తీవ్రమైన రక్తహీనతను నివారిస్తాయి. ప్రసవ సమయంలో ఇబ్బంది లేకుండా చేస్తాయి. ఐరన్, ఫోలిక్ యాసిడ్ సప్లిమెంట్ల సరఫరాను పెంచితే సమస్యకు కొంతమేర చెక్ చెప్పవచ్చునని నిపుణులు చెబుతున్నారు. మాతా శిశువులకు అవసరమైన ఆహారాన్ని అందించే ఏర్పాట్లు చేయడం, రక్తహీనతకు కారణాలేమిటనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపడితేనే ఈ సమస్యను ఎదుర్కోగలుగుతామని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు జారీ



టీ మీడియా,ఫిబ్రవరి18, హైదరాబాద్:రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ జి ఓ ఎం ఎస్ నెం. 252 ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడం జరుగుతుందని సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, ఫ్రీ ల్యాన్సర్ మరియు వెటరన్ జర్నలిస్టులు అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి సమాచార శాఖ ప్రత్యేక వెబ్ సైట్ ను రూపొందించామన్నారు. ipr.telangana.gov.in వెబ్ సైట్ లో ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఈ నెల 9వ తేదీ నుండి దరఖాస్తు లను ఆన్లైన్ లో తీసుకోవడం జరుగుతుందన్నారు. అక్రిడిటేషన్ దరఖాస్తు మరియు జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, దరఖాస్తు చేసుకునే సమయంలో ఏదైన టెక్నికల్ సమస్యలు ఉత్పన్నమైతే సమాచార శాఖ మీడియా రిలేషన్ విభాగంలో ఈ నెంబర్ 9154170881కు కార్యాలయం పని వేళలో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటలలో సంప్రదించవచ్చునని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు.



## ఐఎన్ఎస్- సుమేధ నౌకపై రాష్ట్రపతి ప్రయాణం

టి మీడియా, ఫిబ్రవరి 18 , విశాఖపట్నం: విశాఖలో అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష ముగిసింది. విశాఖపట్నం సాగర తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ-2026కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. భారత నావికాదళం దేశ సముద్ర ప్రయోజనాలను కాపాడటంలో అప్రమత్తంగా ఉందని, విస్తృత సముద్ర వాణిజ్యంలో స్థిరత్వానికి దోహదపడుతోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం పేర్కొన్నారు. భారత నావికదళం ఎంతో సమర్థంగా పనిచేస్తోందని కొనియాడారు. బంగాళాఖాతంలో భారత నావికాదళ యుద్ధనౌకలో వైజాగ్ తీరంలో జరిగిన అంతర్జాతీయ నౌకాదళ సమీక్షకు అధ్యక్షత వహించిన రాష్ట్రపతి, సముద్రంలో తలెత్తే ముప్పులు, సవాళ్లకు వ్యతిరేకంగా రక్షణకు విశ్వసనీయ సాధనంగా పనిచేయడానికి భారత నావికాదళం ఈ ప్రాంతంలో మోహరించబడిందన్నారు. ఐఎన్ఎస్-సుమేధ నౌకపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రయాణించారు. ఆరు వరసల్లో 71 యుద్ధనౌకల పరేడ్ నిర్వహించారు. ఫ్లీట్ రివ్యూలో ఐఎన్ఎస్ విక్రాంత్ తో పాటు 45 యుద్ధనౌకలు పాల్గొన్నాయి. యుద్ధనౌకల పరేడ్ ను రాష్ట్రపతి తిలకించారు. ఫ్లీట్ రివ్యూ ప్రపంచ దేశాల మధ్య ఐక్యత, పరస్పర సహకారాన్ని చాటిందని రాష్ట్రపతి కొనియాడారు.

# బీటెక్ ఫీజుల్లో భారీగా కోత

### బీఆర్ఎస్ నేతల కాలేజీలే టార్గెట్



**టి మీడియా, ఫిబ్రవరి 18 , హైదరాబాద్ :** ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ సర్కార్ ప్రయత్నిస్తున్నది. బీటెక్ కోర్సుల ఫీజులను భారీగా తగ్గించనున్నది. ఏకంగా ఇదివరకు అమలైన పాత ఫీజులకు కోతపెట్టింది. ఫీజులు తగ్గించిన కాలేజీల్లో అత్యధికం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కాలేజీలే ఉన్నాయి. బీఆర్ఎస్ నేతల కాలేజీలను టార్గెట్ చేసుకుని మరీ ఫీజులు తగ్గించారు. మొత్తం 19 కాలేజీల్లో ఫీజులు తగ్గించగా 15 వరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కాలేజీలే ఉన్నాయి. ఇందులో మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే వ ం ( రి రాజశేఖర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన విద్యాసంస్థలున్నాయి.అనురాగ్ విద్యాసంస్థల కాలేజీలకు రూ. 35,100 వరకు తగ్గించారు. ఇవేకాక నల్ల మల్లారెడ్డి కాలేజీ ట్యూషన్ ఫీజును ఏకంగా రూ. 45వేలు తగ్గించారు. గురునానక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫీజును రూ. 43వేలకు కోతపెట్టారు. ఈ విషయం చివరికి హైకోర్టుకు చేరింది. విద్యాసంవత్సరం ముగింపునకు చేరుకున్నా ప్రభుత్వం ఫీజులను ఖరారుచేయకపోవడంతో కొన్ని యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించాయి. ప్రస్తుతం ఇదే విషయం కోర్టు విచారణలో ఉంది. రాష్ట్రంలో మొత్తం 157 ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయి. 2025 -28 విద్యాసంవత్సరానికి ఫీజుల సవరణకు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ(టీఏఎఫ్ఆర్సీ) ఓ నివేదికను సిద్ధం చేసి సర్కార్‌కు సమర్పించింది. ఓ ఐదు కాలేజీల ఫీజుల సవరణకు ప్రతిపాదనలు సమర్పించలేదు. అంటే ఇవి మూతపడ్డట్టే లెక్క. కాగా 63 కాలేజీల్లో ఫీజులను పెంచారు. మరో 70 కాలేజీల్లో పాత ఫీజులే కొనసాగించారు.

కాంగ్రెస్ నేతల కాలేజీల్లో పెంపు

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతలకు చెందిన కాలేజీల్లో భారీగా ఫీజులు పెంచబోతున్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి చెందిన బ్రిలియంట్ కాలేజీలో ఫీజును రూ. 9,200కు పెంచారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కాలేజీలో, జనగామ నుంచి పోటీచేసిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కాలేజీలో రూపాయి కూడా తగ్గించలేదు. ఈ కాలేజీల్లో పాత ఫీజులనే సిఫారసు చేశారు. తీగల కృష్ణారెడ్డి కాలేజీలో రూ. 14,500 పెంచేందుకు ప్రతిపాదించారు. ఇక కొన్ని కాలేజీల్లో అయితే భారీగా ఫీజులు పెంచారు. 10 కాలేజీల్లో గరిష్ఠంగా రూ. 62వేలు, కనిష్ఠంగా రూ.21,200 పెంచారు. జీ నారాయణమ్మ కాలేజీ ఫీజును ఒకేసారి రూ.62వేలు పెంచాలని నిర్ణయించారు. వాసవీ కాలేజీ ఫీజును రూ.35వేలు, గోకరాజు రంగరాజు కాలేజీలో రూ. 30,500, శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో రూ. 27వేలు, కేశవ్ మెమోరియల్ కాలేజీలో రూ.26,200, వీఎన్నార్ విజ్ఞానజ్యోతిలో రూ, 24,600 పెంచేందుకు టీఏఎఫ్ఆర్సీ సిఫారసు చేసింది.

ఫీజులు తగ్గిన కాలేజీలు


నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ : 45,000,గురునానక్ : 43,000,అనురాగ్ గ్రూప్ : 35,100,సీఎమ్మార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ : 31,900,సీఎమ్మార్ టెక్నికల్ క్యాంపస్ : 25,300,మహవీర్ : 25,000,సీఎమ్మార్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ : 23, 800,మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ ఫర్ విమెన్ : 22,700,అర్జున్ కాలేజీ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ : 22,000, విద్యాజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ : 19,800,ఎంఎల్ఆర్ఐటీ : 19,800,ఏఆర్ మహవీర్ కాలేజీ : 15,000, మర్రి లక్ష్మణరెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ : 11,500,మల్లారెడ్డి కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ : 10,200,సెయింట్ మార్టిన్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ : 9,200,సీఎమ్మార్ ఇంజినీరింగ్ కాలేజీ : 5,000,

## ముస్లింల రిజర్వేషన్‌ను తొలగించిన మహారాష్ట్ర




**టి మీడియా , ఫిబ్రవరి 18 ,ముంబయి :** మహారాష్ట్రలోని బిజెపి ప్రభుత్వం ముస్లింల ఐదు శాతం రిజర్వేషన్‌ను తొలగించింది. ఆ రాష్ట్రంలోని విద్యా సంస్థలు, ప్రభుత్వ, సెమీ గవర్నమెంట్ జాబ్స్‌లో ముస్లిం కమ్యూనిటీకి ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని పదేళ్ల క్రితం ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. జూలై 2014లో ప్రవేశపెట్టిన ఈ ఆర్డినెన్స్‌పై ముంబై హైకోర్టులో సవాల్ చేయగా..నవంబర్ 14, 2014లో హైకోర్టు దీనిపై స్టే విధించింది. దీంతో డిసెంబర్ 23, 2014నాటికి చట్టంగా అమలు చేయకపోవడంతో ఈ ఆర్డినెన్స్ గడువు ముగిసింది. తరువాత సుప్రీంకోర్టు బాంబే హైకోర్టు ఆదేశానికి వ్యతిరేకంగా స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పి)ను నిర్ణయిస్తూ రిజర్వేషన్లను రద్దు చేసింది. అయితే గత పదేళ్లుగా మహారాష్ట్ర ప్రభుత్వం దీన్ని రద్దు చేస్తూ ఎలాంటి ఉత్తర్వులు ప్రకటించలేదు. తాజాగా అధికారంలో ఉన్న ఫడ్నవీస్ ప్రభుత్వం ఈ రిజర్వేషన్లను రద్దు చేసింది.ఈ రిజర్వేషన్లను రద్దు చేయడానికి రెండు ప్రధాన కారణాలున్నాయి. ఒకటి ఎస్ఎల్‌పి ఆర్డర్ ద్వారా సుప్రీంకోర్టు ఆ ఆర్డర్‌ను రద్దు చేయడం. రెండు.. కోర్టు ఆదేశాలననుసరించి చట్టంగా మార్చడానికి బిల్లుగా మహారాష్ట్ర శాసనసభ ముందుకు రాకపోవడం. ఈ రెండు కారణాల వల్లే దశాబ్దకాలంగా అమలులో లేని రిజర్వేషన్‌ను రద్దు చేస్తూ మంగళవారం మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని సామాజిక న్యాయ శాఖ ప్రకటించింది.

## రాజ్యసభ సీట్ల కోసం మార్చి 16న ఎన్నికలు



**టి మీడియా, ఫిబ్రవరి 18 , న్యూఢిల్లీ బ్యూరో :** ఖాళీ కాబోతున్న రాజ్యసభ సీట్లకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం పది రాష్ట్రాల్లో సుమారు 37 రాజ్యసభ స్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఆ స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నది. తెలంగాణ నుంచి కేఆర్ సురేశ్ రెడ్డి, డాక్టర్ అభిషేక్ మను సింఘ్వీ స్థానాలు ఖాళీ కానున్నాయి. ఏప్రిల్ 9వ తేదీన ఆ ఇద్దరి పదవీకాలం ముగియనున్నది. ఇక మహారాష్ట్ర నుంచి అత్యధికంగా ఏడు మంది రాజ్యసభ ఎంపీలు తమ పదవీకాలాన్ని ఏప్రిల్ 2వ తేదీన పూర్తి చేసుకోనున్నారు. దీంతో ఆ రాష్ట్రానికి చెందిన ఆ ఏడు స్థానాలకు కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు.ఒడిశాలో నలుగురు , తమిళనాడులో ఆరుగురు, బెంగాల్‌లో అయిదుగురు, అస్సాంలో ముగ్గురు , బీహార్‌లో అయిదుగురు, చత్తీస్‌ఘడ్, హర్యానాల్లో ఇద్దరేసి, హిమాచల్ ప్రదేశ్‌లో ఒకరి సీటు కోసం ఎన్నికలు నిర్వహించనున్నారు. 37 మంది రాజ్యసభ సభ్యులు ఏప్రిల్‌లో రిటైర్ కానున్నారని, వారి స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ఇవాళ తన మీడియా ప్రకటనలో పేర్కొన్నది. ఎన్నికల షెడ్యూల్‌కు చెందిన నోటిఫికేషన్ ఫిబ్రవరి 26వ తేదీన రిలీజ్ చేయనున్నారు. మార్చి 5 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. మార్చి 9వ వరకు దరఖాస్తులు విత్‌డ్రా చేసుకోవచ్చు. 16వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు ఓటింగ్ జరుగుతుంది. ఆ రోజే సాయంత్రం 6 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుంది.

# వీసా ప్రక్రియను సులభతరం చేస్తాం



### ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ వ్యాఖ్యలు

**టీ మీడియా,ఫిబ్రవరి18, ఢిల్లీ బ్యూరో :** భారతీయ విద్యార్థుల కోసం వీసా, అడ్మిషన్? ప్రక్రియను సరళీకరిస్తామని, అలాగే ఫ్రాన్స్‌లో ఇంగ్లీష్ మాధ్యమంలో బోధించే కోర్సులను పెంచుతామని ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ బుధవారం ప్రకటించారు. 2030 నాటికి భారతీయ విద్యార్థుల సంఖ్యను ఏడాదికి 30,000కు పెంచడమే లక్ష్యంగా ప్రధాని మోదీతో కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. భారతదేశ పర్యటనలో భాగంగా బుధవారం ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి విద్య, శాస్త్రీయ సమావేశంలో మేక్రాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ క్యాంపస్‌లో ఆయన ప్రసంగిస్తూ, భారత్-ఫ్రాన్స్ విద్యా సంబంధాలను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

**ఇండో-ఫ్రెంచ్ క్యాంపస్**

ఈ సందర్భంగా మేక్రాన్?, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి, 'ఇండో-ఫ్రెంచ్ క్యాంపస్ ఆన్ ఏఐ ఇన్ గ్లోబల్ హెల్త్'ను ప్రారంభించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలలో ఇరు దేశాల మధ్య సహకారాన్ని పెంచడానికి ఇది ఒక కీలక అడుగు అని అన్నారు. పరిశోధన, ఆవిష్కరణ, సామర్థ్య నిర్మాణం వంటి అంశాల్లో పరస్పర సహకారాన్ని మరింతగా పెంచడం దీని లక్ష్యమని పేర్కొన్నారు. ఆంగ్ల మాధ్యమంలో విభిన్న కోర్సులు మరోవైపు, ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే భారత విద్యార్థులకు ప్రపంచ స్థాయి బోధన, ప్రముఖ

మిగతా 3లో..





# సంత్ సేవలాల్ మహరాజ్ జయంతి

## నివాళులు అర్పించిన మాజీ మంత్రి

**టీ మీడియా, ఫిబ్రవరి 17, వనపర్తి బ్యూరో:**బంజారాల ఆరాధ్య దైవం అయిన సంత్ సేవలాల్ 287వ జయంతి సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జిల్లా బంజారా భవన్ లో ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు.నిరంజన్ రెడ్డికి బంజారా నాయకులు ఘనంగా స్వాగతం పలికి సంప్రదాయ దుస్తులు బహుకరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాలను చైతన్యం చేసి అహింసనే ఆయుధంగా చైతన్యం చేశారని అన్నారు. బంజారాలకు స్థిర నివాసాలు ఏర్పాటు చేయించి సంస్కృతి సంప్రదాయాలను నేర్పించి సామాజిక రుగ్మతలనుండి దూరం చేసిన మహనీయుడు సంత్ సేవలాల్ మహరాజ్ అని కొనియాడారు.బంజారా సోదరులకు ప్రత్యేక స్థలం కేటాయించి అద్భుతమైన భవనాన్ని నిర్మించామని రాబోవు కాలంలో బంజారా సోదరులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.నిరంజన్ రెడ్డి వెంట జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, దేవర్ల. నరసింహ, చిట్యాల.రాము మరియు చంద్రశేఖర్ నాయక్,జాత్ర నాయక్,ధర్మా నాయక్, నారాయణ నాయక్, టీక్యా నాయక్, రాజ్ కుమార్ నాయక్, కౌన్సిలర్ బాబు శంకరమ్మనాయక్, జంప్ల నాయక్,భూచ్యా నాయక్ తదితరులు ఉన్నారు.

# మా సంక్షేమానికి నిధులను కేటాయించాలి

## న్యాయవాదుల నిరసన




**టి మీడియా , ఫిబ్రవరి 18 ,తణుకు (పశ్చిమ గోదావరి) :** న్యాయవాదుల సంక్షేమానికి రూ. 200 కోట్లు బడ్జెట్లో కేటాయించాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బడ్జెట్టుకు వ్యతిరేకంగా, న్యాయవ్యవస్థకు, న్యాయవాదుల సంక్షేమానికి నిధులు కేటాయించడంలో ప్రభుత్వం పట్టించుకోలేదంటూ .... బుధవారం తణుకు బార్ అసోసియేషన్ ఎదుట ఐలు ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కామన మునుస్వామి మాట్లాడుతూ ... రాష్ట్రంలో న్యాయవాది వృత్తిలో 50 వేల మంది పని చేసుకుంటూ వారి జీవన విధానాన్ని కొనసాగిస్తున్నారని, అటువంటి న్యాయవాదులు రాష్ట్ర ప్రభుత్వానికి కోర్టు ఫీజు రూపంలో కోట్లాది రూపాయలు రాబడినీ చేకూరుస్తున్న ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమానికి ఒక రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు. రాష్ట్రంలోను, దేశంలోను న్యాయవాదులపై దాడులు పెరిగాయని హత్యలు జరుగుతున్న వారికి రక్షణ లేదని రక్షణకు సమగ్రమైన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. మూడు సంవత్సరాలలోపు ఉన్న జూనియర్ న్యాయవాదులకు అందరికీ న్యాయమిత్రుల ద్వారా పదివేల రూపాయలు ఇవ్వాలని మునుస్వామి ప్రభుత్వానికి కోరారు. కోట్ల కేసులు పెండింగ్ ఉన్నాయని వాటిని సత్వరమే పరిష్కరించుటకు కోర్టులు ఏర్పాటు చేయాలని, ఖాళీలు ఉన్న న్యాయమూర్తుల పోస్టులను కోర్టులో ఉన్న ఉద్యోగాలను ప్రభుత్వం భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేసులు చేసే సందర్భాల్లో న్యాయవాదులు ఒత్తిడులకు గురై అనారోగ్యాలకు గురవుతారని, వైద్యం పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వమే చేయించాలని వారికి హెల్త్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన న్యాయవాదులు అందరికీ ఇళ్ల స్థలాలు, ఇల్లు నిర్మాణానికి ప్రభుత్వం నిధులను కేటాయించాలని మునిస్వామి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తణుకు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చోడే గోపికృష్ణ న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, జి అంబేద్కర్, బి విక్టర్ బాబు, కే. దుర్గా భవాని, ఎస్ .లాజర్, కొండా శ్రీనివాసు, హెచ్ నాగార్జున దాసు, చింతపల్లి నాగేశ్వరరావు, ఎన్ సోమేశ్వరరావు డి, భాస్కర్, దొమ్మేటి సూర్యనారాయణ,ఎం ప్రతాప్ కుమార్, ఏలూరి మోషే, బి.కుటుంబరావు, ఎం .మధుమూర్తి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ పార్టీలో చేరికలు

**టీ మీడియా ,ఫిబ్రవరి 18,పెబ్బేరు :**పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డుకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం టిఆర్ఎస్ లో చేరారు. పట్టణ అధ్యక్షుడు దిలీప్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సమక్షంలో బి ఆర్ఎస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు అందుకే నాయకులు బి ఆర్ ఎస్ పార్టీ లోచేరుతున్నారని అన్నారు.

# క్షయ వ్యాధి కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్





**టీ మీడియా, ఫిబ్రవరి 17, వనపర్తి బ్యూరో:** క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి రోగికి అవసరమైన సలహాలు, పోషకాహార సూచనలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.బుధవారం జిల్లా కేంద్రంలోని క్షయ వ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని కలెక్టర్సందర్శించారు. కేంద్రానికి నిత్యం ఎంతమంది రోగులు వస్తున్నారు, వారికి అందిస్తున్న వైద్య సేవలు, పరీక్షలు, మందుల పంపిణీ తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగుల నమోదు, చికిత్స విధానం, ఫాలోఅప్ చర్యలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి రోగికి అవసరమైన సలహాలు, పోషకాహార సూచనలు అందించాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను విస్తృతంగా చేయాలన్నారు. ప్రజలు క్షయ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.చిన్న పిల్లల్లో గుండె సంబంధ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి.వనపర్తి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆర్బీఎస్కే కార్యక్రమం ద్వారా జిల్లా కేంద్రంలో గుండె సంబంధిత సమస్యలతో బాధ పడుతున్న 0–18 ఏళ్ళ లోపు పిల్లలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సందర్శించి, నిర్వహణ తీరును పరిశీలించారు. హృదయ సంబంధిత సమస్యలు ఉన్న పిల్లలకు మెరుగైన వైద్యం అందించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పిల్లల ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని, అవసరమైన వైద్య పరీక్షలు, తదుపరి చికిత్స, అవసరమైతే ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేసే చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.హైదరాబాద్ స్టార్ హాస్పిటల్స్ నుండి వచ్చిన వైద్య నిపుణులు సుమన్ వ్యాస్ నేతృత్వంలో 62 మంది పిల్లలకు ఈ శిబిరంలో హృదయ సంబంధిత పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం 18 మందికి సర్జరీకి రిఫర్ చేయడం జరిగిందని వైద్యశాఖ అధికారులు తెలియజేశారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాయినాథ్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ పరిమళ, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



**టీ మీడియా, ఫిబ్రవరి 18, టేక్మాల్ ప్రతినిధి:** మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని దాదాయిపల్లి గ్రామంలో తాలెల్మా ప్రభాకర్ గౌడ్ తల్లి, తాలెల్మా అంజమ్మ ఈ రోజు ఉదయం స్వర్గీయులయ్యారనే వార్త ఎంతో బాధాకరం. వారి ఈ దుఃఖ సమయంలో వారి కుటుంబానికి మన గ్రామ సర్పంచ్ ప్రియతమ యువ నాయకుడు దేశ్పాండే నర్సింగరావు తన హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తూ, చావు ఖర్చుల నిమిత్తం రూ.10,000/–గతంలో తాలెల్మా అంజమ్మ చికిత్స కోసం ఆసుపత్రి ఖర్చులకు రూ.50,000/–మొత్తం రూ.60,000/– ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. కష్టకాలంలో గ్రామ పెద్దగా అండగా నిలుస్తూ, మానవీయ విలువలకు ప్రతీకగా నిలిచిన మా సర్పంచ్ ఈ సేవ అభినందనీయం. తెలిపారు ఇలాంటి నాయకత్వం ఉండటం మన గ్రామానికి గర్వకారణం అలాగే గ్రామాభివృద్ధికి గ్రామ ప్రజలకు అండగా నిలిచినందుకు అభినందనలు తెలియజేశారు.



## సేవాలాల్ చూపిన మార్గాలు ఆచరణీయం

### శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి

**టీ మీడియా, ఫిబ్రవరి 17, వనపర్తి బ్యూరో:**సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287 వ జయంతి ఉత్సవాలను బుధవారం జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నాగవరం గ్రామ శివారులోని సేవా లాల్ బంజారా భవన్ లో సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. జిల్లాలోని నలుమూలల ఉన్న తాండాల నుండి గిరిజనులు హాజరు కాగా లంబాడి మహిళలు తమ సాంప్రదాయ దుస్తులతో వేడుకలకు హాజరయ్యారు.ముందుగా సేవాలాల్ మహారాజ్, మేరమ యాడి దేవతకు మహాబోగ్ (హోమం) కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, లంబాడి పూజారులు రాజ్ పవార్, బిక్ష్యా నాయక్ తో కలిసి సాంప్రదాయ బద్దంగా హోమంలో నెయ్యి, కడావ్ ప్రసాదం వేసి నైవేద్యం సమర్పించారు. జిల్లాలోని సమస్త ప్రజలు ఆయురారోగ్యాలు, ధన ధాన్యాలతో వర్ధిల్లె విధంగా ఆశీర్వదించాలని ప్రార్థించారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ చూపిన సన్మార్గాలు ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని చెప్పారు.శాసన సభ్యులు మేఘా రెడ్డి మాట్లాడుతూ సేవాలాల్ 287వ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. వనపర్తి నియోజకవర్గానికి రూ.2.68 లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. దౌర్జన్యానికి వ్యతిరేకంగా బ్రిటిష్ వారితో పోరాటం చేసిన యోధుడని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ పి. సీతారాం నాయక్, గిరిజన అభివృద్ధి అధికారి అధికారులు, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మిడిదొడ్డి మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, గిరిజన సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, గిరిజన ఉద్యోగులు, గిరిజన మహిళలు, విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.



## ఇంటర్ బోర్డు కార్యాలయం

### ప్రైవేట్ కళాశాలల సంఘం ఆందోళన

**టి మీడియా , ఫిబ్రవరి 18 ,హైదరాబాద్:** నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్య సంఘం ఆందోళనకు దిగింది. బుధవారం (ఫిబ్రవరి 18) ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఛాంబర్?లో బైఠాయించారు సంఘం నాయకులు. 400 మంది విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం కల్పించకుండా ఇంటర్ బోర్డు విద్యార్థుల జీవితాలో చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యార్థులకు న్యాయం చేయకుండా బోర్డ్ కార్యదర్శి ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. తక్షణమే విద్యార్థులకు హాల్ టికెట్లు ఇచ్చి ఎగ్జామ్?కు అనుమతించాలని డిమాండ్ చేశారు. దాదాపు మూడు గంటలుగా ఛాంబర్?లో బైఠాయించారు.

## రోడ్డు ప్రమాదం..

### -బట్టల వ్యాపారి దుర్మరణం



**టి మీడియా , ఫిబ్రవరి 18 ,మెదక్** :జిల్లాకొల్చారం గ్రామ శివారులో ప్రమాదం జరిగింది. అతివేగంగా వచ్చిన ఓ కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.మృతుడిని మెదక్ పట్టణానికి చెందిన వీవీ సిల్క్స్ బట్టల షాపు యజమాని వనపర్తి రోహిత్ గుప్తా (50) గా గుర్తించారు. క్షతగాత్రుడిని ఎల్లారెడ్డికి చెందిన విజయ్‌గా గుర్తించారు. వీరు విజయవాడకు వెళ్లి తిరిగొస్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.యాక్సిడెంట్ గురించి సమాచారం తెలియగానే పోలీసులు ఘటనాస్థలికి వచ్చి పరిశీలించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## మాజీ మంత్రి అంబటి విడుదల



**టి మీడియా , ఫిబ్రవరి 18 ,రాజమండ్రి** :సత్తెనపల్లిలో సంక్రాంతి పండుగ రోజున లక్కీడ్రా నిర్వహించిన కేసులో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు బెయిల్ లభించింది. దీంతో బుధవారం (ఫిబ్రవరి 18) సాయంత్రం రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి ఆయన విడుదలయ్యారు. 2023లో సంక్రాంతి పండుగ సమయంలో అంబటి రాంబాబు లక్కీ డ్రా నిర్వహించారని జనసేన నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు గుంటూరు పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. జ్యుడిషియల్ రిమాండ్?లో భాగంగా జైల్లో ఉన్న అంబటి రాంబాబుకు బుధవారం గుంటూరు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన జైలు నుంచి విడుదల అయ్యారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ.. నా ఇంటిపై దాడి చేసి కార్లను ధ్వంసం చేశారు.. నా భార్య, పిల్లలను హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు.తనపై అక్రమ కేసు బనాయించారని.. అయినప్పటికీ భయపడకుండా ఎన్నిరోజులైనా జైల్లోనే ఉందామని వెళ్లానని తెలిపారు. బాధితుడిని లోపల పెట్టి నిందితులను వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోనేందుకు సిద్ధమని.. దేవుడున్నాడు.. ధర్మమే గెలుస్తుందని అన్నారు.



## పోలీసులపై దాడి కేసులో

# బాల్క సుమన్ అరెస్ట్

**టి మీడియా , ఫిబ్రవరి 18 ,క్యాతనపల్లి :**మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నిక సందర్భంగా పోలీసులపై దాడి చేసిన కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్ అయ్యారు. చైర్మన్, వైస్ ఎన్నికలో ఎక్స్ ఆఫిషియో ఓటు వేసేందుకు క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీసుకు వెళుతున్న.. మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీ కృష్ణ కాన్వాయ్?పై రాళ్లతో దాడి చేయటం.. పోలీస్ సెక్యూరిటీ కోన్ విసిరేయటం వంటివి చేశారు బాల్క సుమన్.తన అనుచరులను రెచ్చగొట్టి.. దాడి చేయించటంలో కీలక పాత్ర పోషించారు బాల్క సుమన్. ఈ దాడిలో ఓ పోలీస్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడి హైదరాబాద్?లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.. మరో కాంగ్రెస్ కార్యకర్త సైతం గాయపడ్డాడు. క్యాతనపల్లిలో జరిగిన గొడవపై కేసు నమోదు చేశారు పోలీసులు.ఈ కేసులో భాగంగా 2026, ఫిబ్రవరి 18న క్యాతనపల్లిలోని బాల్క సుమన్ ఇంటికి వెళ్లిన పోలీసులు నిబంధనల ప్రకారం నోటీసులు ఇచ్చి అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో బాల్క సుమన్ ఇంటి వద్ద కాసేపు హైడ్రామా నడిచింది. బాల్క సుమన్ అరెస్ట్ చేసేందుకు వెళ్లిన పోలీసులను అతడి అనుచరులు, బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు.బాల్క సుమన్ ఇంటి గేటు మూసి పోలీసులను ఇంట్లోకి రాకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేసి హంగామా సృష్టించారు. అయినప్పటికీ సంయమనంతో వ్యవహరించిన పోలీసులు రూల్స్ ప్రకారం బాల్క సుమన్?ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వైద్య పరీక్షల కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఆధార్ కాదు..

### -ఈ స్మార్ట్ ఈ కార్డ్స్ ఉంటేనే ఉచిత ప్రయాణం



**టి మీడియా , ఫిబ్రవరి 18 ,హైదరాబాద్** :తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని మహిళల అందరికి మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందిస్తోంది. అయితే ప్రభుత్వం ప్రస్తుతం ఆధార్ కార్డు ఆధారంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తోంది. అయితే ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు మహిళలు నకిలీ ఆధార్ కార్డులతో ఈ పథకాన్ని దుర్వినియోగం చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. దీనిని అరికట్టేందుకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేయాలని ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది.ఇప్పుడు ఆధార్ కార్డు ప్రమాణికంగా ఉచిత బస్సు ప్రయాణాన్ని ఎలా అనుమతిస్తున్నారో.. ఈ కార్డులు జారీ చేసిన తర్వాత స్మార్ట్ కార్డుల ఆధారంగా ఉచిత ప్రయాణాన్ని అమలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్టు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. అంటే వీటి జారీ తర్వాత కేవలం స్మార్ట్ కార్డులు ఉన్న మహిళలకు మాత్రమే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఉండొచ్చని తెలుస్తోంది.అయితే ఈ స్మార్ట్ కార్డుల జారీ విషయాన్ని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని.. వీటి కోసం మూడు నమూనాలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపామని.. వాటిలో ప్రభుత్వం ఒక నామునాను ఖరారు చేసినట్టు తెలిపారు. వచ్చే నెల నుంచే ఈ స్మార్ట్ కార్డులను జారీ చేయనున్నట్టు ఆర్టీసీ ఎండి తెలిపారు. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా టికెట్ జారీ ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని ఆయన తెలిపారు.

## ఎయిడెడ్ ఉపాధ్యాయుల

# క్రమబద్ధీకరణ

- ఎల్‌డిఎఫ్ ప్రభుత్వంనిర్ణయం



**టి మీడియా , ఫిబ్రవరి 18 ,తిరువనంతపురం :** కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం ప్రకటించింది. ఎయిడెడ్ స్కూల్స్‌లో పనిచేస్తున్న సుమారు 20,000మంది ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించనున్నట్లు బుధవారం ప్రకటించింది. రెండు వారాల్లోగా ప్రతిపాదనలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. క్రమబద్ధీకరణపై తుది తీర్పు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పటికీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.కేరళ విద్యాశాఖ మంత్రి వి.శివన్‌కుట్టి బుధవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని ఎయిడెడ్ పాఠశాలల్లో విభిన్న ప్రతిభావంతుల కోసం రిజర్వేషన్ల అమలు, ఉపాధ్యాయుల నియామకాలను ఆమోదించడం సహా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న న్యాయ సంక్లిష్టతలను పరిష్కరించడంలో భాగంగా ఈచర్య తీసుకున్నట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల హక్కుల చట్టం 2017 ప్రకారం ఎయిడెడ్ పాఠశాలల్లో వారికి నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేయడం తప్పనిసరి అని అన్నారు. గతంలో 1996 చట్టం ప్రకారం మూడు శాతం రిజర్వేషన్ ఉండేది. న్యాయ వివాదం కారణంగా ఎయిడెడ్ పాఠశాలల్లో కోటాను అమలు చేయడంలో జాప్యం చట్టపరమైన వివాదాలకు దారితీసిందని అన్నారు.

1996 నుండి రిజర్వేషన్లను పునరాలోచించి అమలు చేయాలని హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశించింది. అయితే అది ఇప్పటికే ఉన్న వేలాదిమంది ఉపాధ్యాయులను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని ప్రభుత్వం వాదించింది. తర్వాత రాష్ట్రం అప్పీలు దాఖలు చేసిందని అన్నారు. డివిజన్ బెంచ్ తీర్పు ప్రకారం. 2021 తర్వాత నియమించబడిన ఉపాధ్యాయలును రోజువారీ వేతన స్థితికి తగ్గించినట్లు సమాచారం ఉంది" అని ఆయన అన్నారు.

నాయర్ సర్వీస్ సొసైటీ దాఖలు చేసిన పిటిషన్‌పై విభిన్న ప్రతిభావంతులకు కేటాయించిన పోస్టులను మినహాయించి, జనరల్ కేటగిరీ నియామకాలకు సుప్రీంకోర్టు అనుమతించింది. అయితే ఎన్ఎస్ఎస్ పాఠశాలలకు మంజూరు చేసిన ప్రయోజనాన్ని ఇతర ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలకు కూడా విస్తరించాలని కోరుతూ రాష్ట్రం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందని అన్నారు. అయితే కేసును ఏప్రిల్‌కు వాయిదా వేసినట్లు చెప్పారు. రాష్ట్రం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది న్యాయ సలహా ఆధారంగా, సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న స్పెషల్ లీవ్ పిటిషన్లు తుది ఫలితానికిలోబడి, ఇతర యాజమాన్యాల కింద పనిచేస్తున్న ఉపాధ్యాయులను కూడా క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని నిర్ణయించిందని మంత్రి తెలిపారు.ఎన్ఎస్ఎస్ పాఠశాలల్లో జనరల్ కేటగిరీ ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం.. అన్ని ఎయిడ్ఎడ్ పాఠశాలల యాజమాన్యాలకు వర్తించేలా ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం చట్టబద్ధంగా సాధ్యమైనంతవరకు చెస్తోందని ఇటీవల అసెంబ్లీలో ప్రకటించిన సంగతి తెలిసిందే.



# సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

**బంజారా గిరిజన విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షులు శివనాయక్**

**టీ మీడియా, ఫిబ్రవరి 18, వనపర్తి బ్యూరో:** వనపర్తి జిల్లాలో అపూర్వ ఉత్సాహం, అపార భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించబడినట్లు బంజారా గిరిజన విద్యార్థి సమైక్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం నుండి ప్రారంభమైన భారీ ర్యాలీ, స్వామి వివేకానంద విగ్రహం వరకు డీజే ఆటపాటలు, బంజారా సంప్రదాయ గీతాలు, యువత ఉత్సాహ నినాదాలతో అంగరంగ వైభవంగా కొనసాగింది. ర్యాలీ అంతటా సేవాలాల్ మహారాజ్ ఆశయాలు, సమాజ ఐక్యత, గిరిజన హక్కుల పరిరక్షణపై స్పష్టమైన సందేశాలు ప్రతిధ్వనించాయి. సేవాలాల్ మహారాజ్ బంజారా సమాజానికి చూపిన దారి, ధార్మికతతో కూడిన జీవన విధానం, సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని శివ నాయక్ పేర్కొన్నారు. యువత పెద్ద ఎత్తున పాల్గొనడం ఈ జయంతి విజయాన్ని మరింత ఘనత చాటిందని తెలిపారు. సమాజ అభివృద్ధి, ఐక్యత, విద్యా పురోగతి దిశగా ముందుకు సాగడమే సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల ప్రధాన సంకల్పమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నరేష్ నాయక్, అరవింద్ నాయక్, బంజారా సేవా సంఘం కిషన్ నాయక్, యంపిటీసి నాగరాజు నాయక్, బంజారా గిరిజన సంఘం బాల్య నాయక్, సునీల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల విక్రయాల కేసు

## తప్పించుకు తిరుగుతున్న ప్రియాంక



**టి మీడియా , ఫిబ్రవరి 18 , విజయవాడ :** రాష్ట్ర వ్యాప్తంగా పిల్లల విక్రయాల కేసు సంచలనం రేపింది. ఈ కేసులో కీలక నిందితురాలు ప్రియంక తప్పించుకు తిరుగుతోంది. గత నెలలో మేరఠ్?లో త్రుటిలో తప్పించుకుంది. నిందితురాలు ఇంటికి రాకుండా ఇతర ప్రాంతాల్లో సంచరిస్తోంది. బెజవాడ పోలీసులు గట్టి నిఘా పెట్టారు. దీంతో నిందితురాలు సిమ్?లు మారుస్తూ ఏమారుస్తోంది. ఢిల్లీ ముఠాకు ఈమే సూత్రధారి. ఈమె దొరికితేనే కేసు ముందుకు సాగేది. నిందితురాలి బాయ్?ఫ్రెండ్? పై పోలీసులు నిఘా పెట్టారు. ఆమె వివరాల కోసం రెక్కీ బృందం మేరఠ్ వెళ్లనుంది. అతడిని అదుపులోకి తీసుకుని విషయం తేల్చనుంది. మరో బృందం ప్రియాంకను అదుపులోకి తీసుకునేందుకు వెళ్లనుంది. మరోవైపు ముంబై ముఠాలోని కవిత సహాయకురాలు నూరిని పోలీసులు అరెస్టు చేయాల్సి ఉంది. థానేలో ఉంటున్నట్లు గుర్తించారు. ఈమె రెండు సార్లు పిల్లలను విజయవాడకు తెచ్చి, సరోజినికి ఇచ్చింది. నిందితుడు అనిల్ విచారణలో అతని బంధువు బాబు పేరు బయటకు వచ్చింది. అతడిని కూడా నిందితుడిగా చేర్చారు. వీరందరినీ అరెస్టు చేసేందుకు ముంబైకి మరో బృందం వెళ్లనుంది.

### పేదింటి బిడ్డలను తెచ్చి

ఇప్పటికే అరెస్టు అయిన నిందితులు ఢిల్లీలో ప్రియాంక నుంచి తాము పిల్లలను తీసుకున్నట్లు వెల్లడించారు. కిరణ్?శర్మ కూడా ఇదే తెలిపింది. ఢిల్లీలో కిరణ్?శర్మ ప్రియాంక ఒకేచోట ఉండేవారు. పేదింటి బిడ్డలను ఈమె ప్రియాంక నుంచి తీసుకునేది. ఆ తర్వాత అమ్మకానికి విజయవాడలో బలగం సరోజినికి చేర్చేది. దీంతో కేసు దర్యాప్తు ప్రియాంక వద్ద ఆగిపోయింది. ఈమె ఎక్కడి నుంచి పిల్లలను తెచ్చిందనేది తేలలేదు. ఉత్తరాది నుంచి పలు ప్రాంతాల కార్మికులు ఢిల్లీ వచ్చి మురికి వాడల్లో జీవిస్తుంటారు. వీరిలో పోషించే స్థోమత లేని వారి పిల్లలను తీసుకుందని అనుమానాలు ఉన్నాయి.

### పాపపు సొమ్ముతో విలాస జీవితం

పిల్లల విక్రయాలతో వచ్చే సొమ్ములో ప్రియాంక విలాస జీవితం గడిపేది. ఈమెకు ఢిల్లీ, యూపీలో మేరఠ్?లోనూ ఇళ్లు ఉన్నాయి. ఢిల్లీలో పశ్చిమ విహార, హరియాణాలో ఫరీదాబాద్?తో పాటు బెజవాడలో 3 స్టేషన్లలో ప్రియాంకపై కేసులు నమోదు అయ్యాయి. ప్రియాంక ఫోన్?లో లొకేషన్?ను ట్రాక్ చేస్తున్నారు. పాత సిమ్?ను తీసేసి, కొత్తది ఉపయోగిస్తోంది. మేరఠ్?లో బాయ్?ఫ్రెండ్?తో టచ్?లో ఉన్నట్లు గుర్తించారు. తర్వాత కొద్ది రోజులకే ఆ సిమ్ స్విచాఫ్ అయింది. కొత్తది తీసుకున్నట్లు గుర్తించారు. ఆ నెంబరును కూడా పట్టుకున్నారు. కానీ దానినీ మార్చేసింది.

### పిల్లల్ని తీసుకుని విక్రయాలు

ప్రియాంకకు వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. ఆమె ఢిల్లీతోపాటు యూపీలోని మీరట్‌లోనూ నివాసం ఉంటున్నట్లు గుర్తించారు. ఢిల్లీ సబర్బన్, యూపీలోని శివారు గ్రామాల నుంచి పిల్లల్ని తీసుకుని వివిధ ప్రాంతాల్లోని ముఠాలకు విక్రయిస్తుంది. ఈమెపై ఢిల్లీలోని పశ్చిమ విహార పోలీసు స్టేషన్, హరియాణాలోని ఫరీదాబాద్ స్టేషన్లతోపాటు విజయవాడలో మూడు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఇది ఒక ఎత్తైతే ప్రియాంక తల్లి, సోదరి, తమ్ముడి పై ఢిల్లీలోని బేగంపూర్ స్టేషన్‌లో పిల్లల విక్రయాల కేసులు నమోదు అయ్యాయి. అక్కడి పోలీసులు వీరిని అరెస్టు చేశారు. తల్లి దేవకి, సోదరి ప్రియ ఢిల్లీలోని మండొలి కారాగారంలో, సోదరుడు పీయూష్ తీహార్ జైలులో రిమాండ్‌లో ఉన్నారు.

# వీసా ప్రక్రియను సులభతరం చేస్తాం

పరిశోధనా కేంద్రాల్లో పని చేసే అవకాశాలు లభిస్తాయని మెక్రాన్? చెప్పుకొచ్చారు. ఆంగ్ల మాధ్యమంలో విభిన్న కోర్సులు అందుబాటులో ఉంచడం ద్వారా భారత విద్యార్థులకు మరింత సౌలభ్యం కల్పిస్తామని వెల్లడించారు. 'మా వద్ద ఉత్తమ బోధన సదుపాయాలు ఉన్నాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పరిశోధనా కేంద్రాలు ఉన్నాయి. విద్యార్థులకు ఆంగ్లంలో కూడా విభిన్న కోర్సులు అందిస్తాం. ఉన్నత విద్యలో వారికి అవసరమైన అన్ని విధాల సహాయ, సహకారాలను అందిస్తాం' అని మెక్రాన్ హామీ ఇచ్చారు.

### భారత్‌తో రక్షణ సంబంధాలపై మెక్రాన్ వ్యాఖ్యలు

అంతకుముందు, కూడా ముంబయిలో జరిగిన 'ఇండియా–ఫ్రాన్స్ ఇన్నోవేషన్ ఫోరమ్'లో మెక్రాన్? మాట్లాడారు. భారత్?తో కుదిరిన రక్షణ సంబంధాలపై ఆయన ప్రస్తావించారు. 'నేల, నీరు ఆకాశం ఇలా అంతటా భారత్– ఫ్రాన్స్ ఒకరికొకరం సహాయ సహకారాలు అందించుకుంటున్నాం' అని మెక్రాన్? తెలిపారు. ఆవిష్కరణ అంటే కేవలం సాంకేతిక రంగంలో సాధించే విజయాలు మాత్రమే కాదని, అవి సామాన్య ప్రజల ప్రయోజనం కోసం, వారి జీవితాలను మెరుగుపరచడం కోసమని మెక్రాన్? పేర్కొన్నారు. ప్రజల జీవితాలను మరింత ఆరోగ్యకరంగా, సురక్షితంగా మార్చడం కోసం అనే ఉమ్మడి ఆకాంక్షతోనే ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. అదేవిధంగా, రక్షణ రంగంలో సాంకేతిక బదిలీపై కూడా ఫ్రాన్స్? అధ్యక్షుడు కీలక వ్యాఖ్యలు చేశారు. జలాంతర్గాములు, రాఫెల్ యుద్ధ విమానాలు, ఐదో తరం విమానాల ఇంజన్లు ఇలా అనేక రంగాలలో ఫ్రాన్స భారత్‌తో కలిసి పని చేస్తోందని మెక్రాన్? తెలిపారు. ఈ రంగంలో సాంకేతిక బదిలీని తాము కూడా విశ్వసిస్తామని చెప్పారు. అయితే, ఈ అంశాన్ని తాము కూడా ప్రతిపాదించినట్లు మెక్రాన్ చెప్పుకొచ్చారు. దీంతో పాటు అంతరిక్ష రంగం వంటి అనేక ఇతర విషయాల్లోనూ ఇరు దేశాల మధ్య సంబంధాలు కొన్నేళ్లుగా అద్భుతంగా కొనసాగుతున్నాయని మెక్రాన్? చెప్పుకొచ్చారు. అందుకే జులైలో తాము ఫ్రాన్స్‌లో నిర్వహించబోయే అంతరిక్ష రంగ సదస్సుకు భారత్‌ను ఆహ్వానించామని ఆయన స్పష్టం చేశారు.

# బిఎల్ఓలకు అలవెన్సులు ఇవ్వాలి



**టీ మీడియా ,ఫిబ్రవరి 18, ఆత్మకూర్:** వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో గత అన్ని ఎన్నికలలో లుగా పనిచేసిన వాళ్లందరికి అలవెన్సు ఇవ్వాలని ఆత్మకూరు తాసిల్దార్ కు మెమోరండం ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ రాజు మాట్లాడుతూ గత పార్లమెంటు శాసనసభ గ్రామపంచాయతీ మున్సిపాలిటీ ఎన్నికలలో సర్వేలు ఓటర్ లిస్ట్ సవరణ కొత్త ఓటర్స్ జైనింగ్ ఓటింగ్ కౌంటింగ్ అనేక అంశాలలో విధులు నిర్వహించిన దీూఉ లకు ఇప్పటివరకు ఎలాంటి అలవెన్సు ఇవ్వలేదు ప్రతినెల వారి జీతంతో పాటు బిఎల్ఓ అలవెన్సులు బి ఎల్ ఓ రూ 1000 ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్కరూపాయి ఇవ్వకుండా కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్న ప్రభుత్వ అధికారులు ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు ఇప్పటికైనా కళ్ళు తెరిచి చిరు ఉద్యోగులైన దీూఉ ల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని తాసిల్దార్ చాంద్ పాషా కు మెమోరండం ఇవ్వడం జరిగింది . ఈ కార్యక్రమంలో బి ఎల్ ఓ లూ సంధ్యారాణి, రఫీయ భాను,కాజియా రాణి విజయలక్ష్మి,రమాదేవి చంద్రకళ, మహేశ్వరి అంజమ్మ,మాధవి తదితరులు పాల్గొన్నారు

### చర్ల పరమేశ్వర స్వామి జాతర ప్రారంభం



**టీ మీడియా, ఫిబ్రవరి 18, ఆత్మకూరు:** వనపర్తి జిల్లా ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో శ్రీ శ్రీ స్వయంభు చర్ల పరమేశ్వర స్వామి జాతర సందర్భంగా మొదటి రోజు శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నుండి పట్టు వస్త్రాలు. ఆభరణాలు తీసుకు వస్తున్న ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ బి నాగమణి. వైస్ ఛైర్మన్ శ్రీనివాసులు వార్డ్ కౌన్సిలర్లు సద్దల తులసి వెంకట్ రాములు జిందె జ్యోతి శ్రీనివాస్ శంకరమ్మ బాల్రాజ్, మార్కెట్ చైర్మన్ రహమతుల్లా ఆత్మకూరు పట్టణ పెద్దలు, జాతర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ముత్యాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవం..



**టీ మీడియా ఫిబ్రవరి 18, టేక్మల్ ప్రతినిధి ;**మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో ముత్యాల పోచమ్మ ఆలయ 4వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తడి పోచమ్మ గ్రామ దేవతలకు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బోనాల పండుగ ను అంగరంగ వైభవంగా, పోతురాజుల విన్యాసాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గ్రామ వాసులు భక్తిశ్రద్ధలతో పాడిపంటలు పిల్ల పాపలు చల్లగా ఉండేలా దీవించమ్మా అంటూ వేడుకున్నారు. వార్షికోత్సవ మహోత్సవానికి హాజరైన ప్రజానీకానికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిమ్మి గారి సుధాకర్, ఉప సర్పంచ్ శంకరయ్య, గొల్లగూడెం వార్డు మెంబర్లు సాదు లింగం, కుర్మ మానెమ్మ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు భక్తుల వీరప్ప, జిల్లా యువత కార్యదర్శి నాయకోటి భాస్కర్, రాములు కిష్టయ్య శివయ్య బీరప్ప సత్యం కిషన్ సాయిలు మల్లేశం, నవీన్ కుమార్, ఎల్లయ్య అంజయ్య, పాపయ్య, బేతయ్య, గ్రామ పెద్దలు ప్రజలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్

#### ఎన్నిక నిర్ణయం ఆర్‌వోదే; హైకోర్టు




**టి మీడియా , ఫిబ్రవరి 18 , హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై తెలంగాణ హైకోర్టులోబుధవారం విచారణ జరిగింది ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక నిర్ణయం ఆర్ వోదేనని హైకోర్టు తెలిపింది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికపై హైకోర్టు ఇచ్చిన స్టే తొలగించింది. మంచిరెడ్డి తరఫు న్యాయవాది మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక జరిగిందని తెలిపారు. ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని యాదగిరి తరఫు న్యాయవాది కోర్టుకు సూచించారు. ఎన్నికపై హెబియస్ కార్పస్ పిటిషన్ లో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది.

#### హైకోర్టులో బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆకుల యాదగిరి

బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆకుల యాదగిరిని పోలీసులు హైకోర్టులో హాజరుపర్చారు. మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కుమారుడు బలవంతంగా తీసుకెళ్లినట్లు యాదగిరి కోర్టుకు తెలిపారు. తనను బాపట్ల జిల్లా చీరాల తీసుకెళ్లి బౌన్సర్లను పెట్టి మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేశారని యాదగిరి వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీతరఫున మున్సిపల్ ఛైర్మన్ రేసులో ఉన్నానని యాదగిరి తెలిపారు. ఈ నెల 16న ఉదయం నుంచి రాత్రి వరకు కారులోనే తిప్పారని వివరించారు. తనకు బీపీ, షుగర్ ఉన్నా భోజనం కూడా ఇవ్వలేదని యాదగిరి ఆవేదన వ్యక్తం చేశారు. తాను లేకపోతే కోరమ్ ఉండదనే తనను తీసుకెళ్లినట్లు కోర్టుకు తెలిపారు. తాను కనిపించకపోవడంతో తన కుమారుడు పిటిషన్ వేశారని యాదగిరి చెప్పారు.

### యూట్యూబ్ డౌన్

#### ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయిన స్ట్రీమింగ్ సేవలు

**టి మీడియా, ఫిబ్రవరి 18 , ఢిల్లీ బ్యూరో :** ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ సేవల్లో అంతరాయం నెలకొంది. మంగళవారం రాత్రి నుంచి ప్రపంచవ్యాప్తంగా యూట్యూబ్ సేవలు నిలిచిపోయాయి. మొబైల్, కంప్యూటర్లలో యూట్యూబ్ ఓపెన్ చేస్తుంటే అని చూపిస్తోంది. కొంతమందికి యూట్యూబ్ వీడియోలు లోడ్ కావడం లేదు. దీంతో ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది యూజర్లు ఫిర్యాదు చేస్తున్నారు. అమెరికాలోనే మూడు లక్షలకు పైగా యూజర్లు డౌన్ డిటెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అవుట్‌టేజ్ ట్రాకింగ్ సైట్ డౌన్‌డిటెక్టర్ ప్రకారం.. ఈ సమస్య మంగళవారం రాత్రి 8 గంటలకు అమెరికాలో మొదలైంది. తమ వెబ్‌సైట్‌కు అమెరికాలో 3,20,000 కంటే ఎక్కువ మంది ఫిర్యాదు చేశారు. ఇండియా నుంచి కూడా 18 వేలకు పైగా ఫిర్యాదులు వచ్చాయి. వీడియోలు ప్లే కావడం లేదని, సెర్చ్ రిజల్ట్ కనిపించడం లేదని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. యూట్యూబ్ సాంకేతిక సమస్యలపై ఆ సంస్థ యాజమాన్యం స్పందించింది. స్ట్రీమింగ్‌లో సమస్యలు ఎదురవుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని తెలిపింది. సమస్కయ పరిష్కారం కోసం పనిచేస్తున్నామని పేర్కొంది.

# తెలుగు రాష్ట్రాల్లోని కోర్టులకు బాంబు బెదిరింపులు



**టి మీడియా, ఫిబ్రవరి 18 ,హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లోని పలు కోర్టులకు బాంబు బెదిరింపులు రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గుర్తు తెలియని వ్యక్తులు ఈమెయిల్ ద్వారా నాంపల్లి, రాజమండ్రి, కరీంనగర్ ప్రాంతాల్లోని కోర్టుల్లో బాంబులు పెట్టామని హెచ్చరించినట్టు సమాచారం అందింది. ముఖ్యంగా నాంపల్లిలోని సీబీఐ కోర్టుకు కూడా బెదిరింపు మెయిల్ వచ్చినట్లు అధికారులు తెలిపారుబాంబు బెదిరింపు సంబంధించిన ఈమెయిల్‌లో మధ్యాహ్నం 12:05 గంటలకు బాంబులు పేలుతాయని పేర్కొనడంతో పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు. కోర్టు ప్రాంగణాల్లో ఉన్న న్యాయవాదులు, సిబ్బంది, ప్రజలను బయటకు పంపించి బాంబ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అధికారుల సమాచారం ప్రకారం ఇప్పటివరకు ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు. ఈ బెదిరింపు మెయిల్స్ ఫేక్ అయ్యే అవకాశం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. అయినప్పటికీ భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసి అన్ని కోర్టు ప్రాంగణాలను పూర్తిగా తనిఖీ చేశారు. Ranji Trophy 2026: 67 ఏళ్ల కల నిజమైంది.. తొలిసారి రంజీ ట్రోఫీ ఫైనల్‌కు జమ్మూ ఐ కాశ్మీర్మూడు క్రిమినల్ కోర్టులకు ఒకేసారి ఒకే సమయానికి బెదిరింపు మెయిల్స్ రావడం పోలీసులను మరింత అప్రమత్తం చేసింది. రెండు రాష్ట్రాలకు సంబంధించిన ఈమెయిల్స్ ఒకే వ్యక్తి లేదా ఒకే మూలం నుంచి వచ్చినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. ఈమెయిల్స్ పంపిన వ్యక్తులు ఎవరు అనే దానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. గతంలో కూడా ఇలాంటి బెదిరింపు మెయిల్స్ పంపిన ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఈసారి కేసును సీరియస్‌గా తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు.

# తెలంగాణలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యం

**-నెట్ జీరో నగరంగా**



**టి మీడియా , ఫిబ్రవరి 18 ,హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రాన్ని నెట్ జీరో స్టేట్ గా తీర్చిదిద్దుతామన్నారు సీఎం రేవంత్ రెడ్డి .అందులో భాగంగానే క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి నమూనాను తీసుకొచ్చామన్నారు. పట్టణాభివృద్ధిలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు సీఎం. తెలంగాణలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యతని స్తున్నామన్నారు. రాష్ట్రంలో 30 లక్షలకు పైగా పంప్ సెట్లు, 50లక్షల ఇండ్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. బొగ్గు, సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సోలార్, గ్రీన్ ఎనర్జీ వైపు మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్, స్థిర శక్తి ఉత్పత్తి పద్ధతులపై నిరంతరం పరిశోధనలు కొనసాగిస్తున్నామని సీఎం చెప్పారు. 2034 నాటికి హైదరాబాద్‌ను నెట్ జీరో నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు సీఎం రేవంత్ రెడ్డి. పట్టణాభివృద్ధిలో భాగంగా కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కోర్ అర్బన్ రీజియన్(క్యూర్)లో ఏ ఒక్క పరిశ్రమ ఉండదని స్పష్టం చేశారు. మహారాష్ట్రలో క్లైమేట్ వీక్ సదస్సులో ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి..పట్టణాలు, నగరాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణమైన విధానాలపై తెలంగాణ విజన్ ను వివరించారు. ప్రస్తుతం అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత్వం కీలకంగా మారాయని అన్నారు సీఎం. ఏ ఆర్థిక వ్యవస్థకైనా విద్యుత్ ఉత్పాదక వనరులే అసలైన కరెన్సీ అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, వినియోగం అభివృద్ధికి కొలమానంగా నిలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర జీడీపీని 200 బిలియన్ డాలర్ల స్థాయి నుంచి 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

# నా విజయ రహస్యం నువ్వే

**-మెగాస్టార్ చిరంజీవి**



**టి మీడియా , ఫిబ్రవరి 18 ,హైదరాబాద్ :** " నా విజయ రహస్యం ఏమిటని ఎవరైనా అడిగితే.. నా ప్రతిభ, కృషి కాదు.. నువ్వే అని చెబుతాను. " అని మెగాస్టార్ చిరంజీవి పేర్కొన్నారు. తాను ఈ స్థాయిలో ఉండడానికి కారణం తన భార్య సురేఖ అని అన్నారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా కొన్ని ఫొటోలు పంచుకున్న చిరు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. " నా ప్రతి అడుగులో నా వెంట నడిచిన నీకు శుభాకాంక్షలు. 1980 ఫిబ్రవరి 20న మనం వివాహం చేసుకున్న నాటినుంచి నువ్వే నా బలంగా మారావు. ఈరోజు నీ పుట్టినరోజుతో పాటు రెండు రోజుల ముందుగానే మన వివాహ వార్షికోత్సవం కూడా చేసుకోవడం నాకు ఆనందంగా ఉంది. నా విజయ రహస్యం ఏమిటని ఎవరైనా అడిగితే.. నా ప్రతిభ, కృషి కాదు.. నువ్వే అని చెబుతాను. నువ్వు కుటుంబ బాధ్యతను చూసుకున్నావు కాబట్టే నేను నటనపై శ్రద్ధ పెట్టాను. కష్టసుఖాల్లో మమ్మల్ని ఒకేతాటిపై నడిపించావు. నీవల్లే నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నాను " అని చిరు తన ప్రేమను వ్యక్తం చేశారు. ఇక సినిమాల విషయానికొస్తే.. ఇటీవలే 'మనశంకర వరప్రసాద్ గారు'తో సూపర్ హిట్‌ను అందుకున్న ఆయన ప్రస్తుతం 'విశ్వంభర'లో నటిస్తున్నారు. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలుగా కనిపించనున్నారు. దీన్ని జులై 9వ తేదీన ప్రేక్షకుల ముందుకుతీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. పేర్కొన్నారు. తాను ఈ స్థాయిలో ఉండడానికి కారణం తన భార్య సురేఖ అని అన్నారు. నేడు ఆమె పుట్టినరోజు సందర్భంగా కొన్ని ఫొటోలు పంచుకున్న చిరు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. " నా ప్రతి అడుగులో నా వెంట నడిచిన నీకు శుభాకాంక్షలు.

# రాజ్యాంగాన్ని మార్చాలి

- **ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్**



**టి మీడియా , ఫిబ్రవరి 18 ,చెన్నై :** కేంద్రం అధికారాలన్నీ తన వద్దే ఉంచుకుని.. రాష్ట్రాలను ఏమాత్రం గౌరవించడంలేదు. అందుకే రాష్ట్ర ప్రభుత్వాలను స్వయంప్రతిపత్తి సంస్థలుగా మార్చడానికి రాజ్యాంగాన్ని సవరించాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ బుధవారం అసెంబ్లీలో డిమాండ్ చేశారు. 'ప్రతి నిధి కోసం కేంద్ర ప్రభుత్వంతో పోరాడాల్సిన పరిస్థితిలో మనం ఉన్నాము. వాళ్లు ఇచ్చే, మనం తీసుకునే స్థితిలో మనం ఎంతకాలం ఉండాలి? అని నేడు అసెంబ్లీలో ఆయన ప్రశ్నించారు. కేంద్ర– రాష్ట్ర సంబంధాలను అధ్యయనం చేయడానికి ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ నివేదికలోని మొదటి భాగాన్ని అసెంబ్లీలో నేడు ఆయన ప్రవేశపెట్టారు. భూమి, ఆర్థిక అధికారాలపై హక్కులను పొందేందుకు మనం ఇంకా కష్టపడాలి అని అని స్టాలిన్ ప్రశ్నించారు. అన్ని అధికారాలను తనవద్దే ఉంచుకున్న కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్ర ప్రభుత్వాలను గౌరవించదు. అప్పుడే మనం మంచి పాలనను పునరుద్ధరించగలం. ఇది కేవలం ఒక్క రాజకీయ పార్టీ డిమాండ్ కాదు. రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ స్వయంప్రతిపత్తి డిమాండ్‌ను గుర్తించాలని స్టాలిన్ నొక్కి చెప్పారు.

# ఐ యు న్ టి యు సి ఆలిండియా ప్రెసిడెంట్ డాక్టర్ సంజీవరెడ్డి జన్మదినం





**టీ మీడియా, ఫిబ్రవరి 18, ఖమ్మం :** ఐ యు న్ టి యు సి ఆలిండియా ప్రెసిడెంట్ డాక్టర్ సంజీవరెడ్డి (మాజీ రాజ్యసభ సభ్యులు) జన్మదిన ఘనంగా హైదరాబాదులోని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ మహేష్ కుమార్ గౌడ్, మాజీ రాజ్యసభ సభ్యులు బి హనుమంతు రావు గారు పాల్గొని సంజీవరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి అలాగే మల్లొక పర్యాయం ఆల్ ఇండియా ప్రెసిడెంట్గా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తగా అధ్యక్షులు సెక్రెటరీగా ఐఎన్‌టిసి మోడీని ఎన్నుకోవడం జరిగినది ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు కొత్త సీతారాములు గారు నగర అధ్యక్షులు నరాల నరేష్ నాయుడు జనరల్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు పట్టణ ఉపాధ్యక్షులు సాంగయ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ఫజల్ సెక్రెటరీ పోతగాని రమణకుమార్ ఆటో యూనియన్ అధ్యక్షులు పాల్వంచ కృష్ణ, హెల్త్ డిపార్ట్మెంట్ రామనాథం ఆర్టీసీ హనుమంతరావు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు

### మాజీ భర్త కిరాతకం

**రెండో పెళ్లి చేసుకుందని హత్య**




**టి మీడియా, ఫిబ్రవరి 18 ,హైదరాబాద్:** వనస్థలిపురం గ్రీన్ సిటీ కాలనీలో దారుణ ఘటన చోటు చేసుకుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సునీత (30)ను ఆమె మాజీ భర్త మహేష్ అత్యంత కిరాతకంగా హత్య చేయడం షాక్‌కు గురిచేసింది. పోలీసులు కథనం ప్రకారం.. సునీత కొన్ని రోజుల క్రితమే మహేష్‌కు విడాకులు ఇచ్చి రెండో వివాహం చేసుకుంది. దీంతో మాజీ భర్త లేపేసేందుకు ప్లాన్ వేశాడు. దీంతో తాజాగా మహేష్ రెండు కత్తులు, పెట్రోల్ డబ్బాతో సునీత ఇంట్లోకి చొరబడ్డాడు. ముందుగా ఆమెతో వాగ్వాదానికి దిగాడు. అనంతరం కత్తులతో తీవ్రంగా గాయపరిచాడు. పూలకుండీతో తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. సునీత రక్తపు మడుగులో పడిఉండగా, మహేష్ అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినట్టు తెలుస్తోంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. పరారీలో ఉన్న మహేష్‌ను కొద్ది గంటల్లోనే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విడాకులు తీసుకుని మరో వివాహం చేసుకోవడాన్ని సహించలేకపోయిన మహేష్ ఈ హత్యకు పాల్పడ్డాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

### చిన్నారి హత్య కేసులో బిగ్ ట్విస్ట్

**సూసైడ్ చేసుకున్న నిందితుడు**



**టి మీడియా, ఫిబ్రవరి 18 ,అన్నమయ్య:** అన్నమయ్య జిల్లాలోని మదనపల్లిలో చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన సైకో కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడు. కురబలకోట మండలంలోని కనసానివారి పల్లి చెరువులో మృతదేహం లభ్యం అయింది. ఆత్మహత్య చేసుకుని చనిపోయినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటన స్థలానికి ముదివేడు పోలీసులు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. కులవర్ధన్ ఆత్మహత్య చేసుకుని చనిపోయినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే, మదనపల్లెలో సైకో కులవర్ధన్ చేతిలో హత్యకు గురైన చిన్నారికి నేడు కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం దిండిమీదాగారి పల్లె గ్రామంలో చిన్నారి అంతిమ సంస్కారాలు జరగనున్నాయి. చిన్నారి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇక, ఈ కేసులో నిందితుడు కులవర్ధన్ కోసం పోలీసులు నిన్నటి నుంచి ప్రత్యేక బృందాలతో గాలించారు. కానీ, ఈరోజు ఉదయం అతడి మృతదేహం కనసానివారి పల్లి చెరువులో కనిపించడంతో సూసైడ్ చేసుకున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు.